క్లుప్తంగా

ఆలోచించి ఓటు వేయాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పి రంగారావు అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహన సదస్సు నిర్వహించారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీని, ఆ పార్టీకి అండగా ఉంటున్న బీఆర్‌ఎస్, ఎంఐఎంలను ఓడించాలన్నారు. నాయకులు రామకృష్ణ, ప్రభాకార్, దేవారం, ముత్తెన్న, రమేష్, రాజేశ్వర్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పట్టణ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. దోమలతో కలిగే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, చికెన్ గన్యా, డెంగీ, మెదడువాపు వంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. సబ్ యూనిట్ అధికారి సాయి, పట్టణ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, హెచ్‌ఎం వనజ పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన



ఆర్మూరటౌన్: ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గల అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం ఆల్‌ఫోర్స్ విద్యార్థులు సందర్శించారు. అగ్నిమాపక శకటం గురించి అధికారి మధుసూదన్‌రెడ్డి వివరించారు.

అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో అనుమతి లేకుండా నడుస్తున్న బీఎడ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ దుర్గాప్రసాద్, డి నిఖిల్, మమత, దీపక్, శివ, కార్తీక్, శివాని పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన 15 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం రాత్రి బీఆర్‌ఎస్‌లో చేరారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, సర్పంచ్ ఖాదర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, తోట సంగయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



రెంజల్: కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మండలంలోని సాటాపూర్, బాగేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలతో గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. కాంగ్రెస్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. సుదర్శన్‌రెడ్డి అల్లుడు సుబ్బారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు మొబిన్‌ఖాన్, నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, సాయరెడ్డి, జావీద్, రాములు, నితిన్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు..



వర్ని(మోస్రా): మండలంలోని గోపూర్, చింతకుంట, మోస్రా, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతు రెడ్డి, సాయిగౌడ్, సర్పంచులు నరేందర్, విమల సాయన్న, భూమన్న, ఎంపీటీసీ కత్తి సాయిలు, సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఫెరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఇది పక్కా రైతు ప్రభుత్వం

- ఆర్మూర్ మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి ఆత్మీయ సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్: కేసీఆర్ హయాంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కా రైతు ప్రభుత్వమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. నందిపేట్‌లోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తన గెలుపు ఖాయమని.. కాంగ్రెస్, బీజేపీలు మాయం అని వ్యాఖ్యానించారు. మున్నూరు కాపులు అసలు సిసలు రైతు బిడ్డలన్నారు. ప్రతీ పథకం రైతుల ముంగిట్లోకి వస్తుందన్నారు. పదేళ్లలో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపానని చెప్పారు. ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, వంద పడకల ఆస్పత్రి, 11 బైపాస్ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టానని వివరించారు. తనను మళ్లీ గెలిపించాలని కోరారు. మరోసారి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు. కేసీఆర్ పాలనలోనే మనకు న్యాయం జరుగుతుందన్నారు. మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఎంపీ అర్వింద్ ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే



చిన్నాపూర్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మాక్లూర్: కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేస్తే రైతులు నట్టేట మునిగినట్టేనని బీఆర్‌ఎస్ ఆర్మూర్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిముక్కల, చిన్నాపూర్ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి మూడు ఫేజుల కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదన్నారు. అంతకు ముందు రెండు గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. సర్పంచులు దారం ప్రవీణ్, పుప్పాల లక్ష్మి గంగారెడ్డి, నాయకులు చిన్‌రెడ్డి, మల్లారెడ్డి, బడుగు సత్యం, ఎంపీటీసీ ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలిస్తాం

బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి



బట్టాపూర్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పోడు భూములకు పట్టాలిస్తామని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మానాల, దేగావత్ తండా, బడి తండా, చింతామణి తండా, అడ్డ బోర్ తండా, గైదీగుట్ట తండాతో పాటు 18 తండాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 కే వంటగ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. సుంకెట రవి, అవారి సత్యం, బోనగిరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ

మోర్తాడ్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తామని సునీల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్గట్ల మండలం బట్టాపూర్, దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీపై హామీని సరిగా నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం ప్రకటించి ఒక్క రైతుకు కూడా మంజూరు చేయలేదన్నారు. తాము గెలిస్తే గల్ఫ్ వలస కార్మికుల కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల గురించి వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల మాజీ ఉప సర్పంచ్ బాస మల్లేశ్, మాజీ వార్డు సభ్యుడు దాసు, రజక సంఘం సభ్యులు శుక్రవారం సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు ముత్యంరెడ్డి, చిన్నారెడ్డి, గంగాధర్, ఆకుల పెద్ద రాజన్న, రమేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మానాల దేగావత్ తండాలో హాజరైన గిరిజనులు

లీకేజీ నీళ్లు అడుక్కునే కర్మ లేకుండా చేశా

- కాకతీయ, వరద కాలువల్లో 365 రోజులు నీళ్లు ఉంచుతున్నాం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



పాలెంలో అభివాదం చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో స్వాగతం పలుకుతున్న మహిళలు

మోర్తాడ్: రైతులు ఎస్సారెస్పీ లీకేజీ వాటర్ అడుక్కునే దుస్థితి లేకుండా చేశామని మంత్రి, బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్, పాలెం గ్రామంలో ఆయన ప్రచారం చేశారు. గతంలో సాగునీరు లేక బాధపడ్డ రైతులు ఎస్సారెస్పీ లీకేజీ వాటర్ కోసం తనను కోపగించుకున్నారని గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రాజెక్టులో సైతం నీళ్లు అడగంటడంతో లీకేజీ వాటర్ ఇవ్వలేకపోయామన్నారు. కానీ రెండేండ్లలో కాకతీయ, వరద కాలువను 365 రోజులు నీళ్లతో ఉంచుతానని మాటిచ్చి చేసి చూపించానన్నారు. కాళేశ్వరం నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా తెచ్చి వరద కాలువ, ఎస్సారెస్పీ నింపుకున్నామన్నారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, టీడీపీలు మహిళల నీటి కష్టాలు తీర్చలేకపోయాయని విమర్శించారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి నల్లాపెట్టి శుద్ధమైన తాగునీటిని అందిస్తూ ఆ సమస్యను దూరం చేశామన్నారు. వాగుల్లో చెక్‌డ్యాంలు నిర్మించి ఈ గ్రామాల బోరు బావుల రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించామన్నారు. తిమ్మాపూర్‌లో రూ.65 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించామన్నారు. రెండు గ్రామాల్లో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సాయిరాం, మల్కన్న, రామన్నపేట్ మాజీ సర్పంచ్ సోమ సాయన్న, అంక్సాపూర్, లక్కోర గ్రామాల యువకులు, బడాభీమ్‌గల్ విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

బాల్కొండ: బాల్కొండ వార్డు సభ్యుడు ఎజాస్ తన అనుచరులతో కలిసి శుక్రవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఉపసర్పంచ్ వాహబ్, సాహిద్ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



రుద్రూర్: రుద్రూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



ఎడపల్లి: ఎడపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం నిజామాబాద్‌లోని శీను నాయక్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్, చిత్రంలో సుదర్శన్ రెడ్డి

- ఆరు గ్యారంటీ స్కీంలు అమలు అవుతాయి
- సాలూర కాంగ్రెస్ సభలో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్

బోధన్: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావు చౌహాన్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ స్కీంలు అమలు అవుతాయని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి సాలూరలో బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు పడుతున్న అవస్థలను గుర్తించి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలతో పాటు రూ.2లక్షల పంట రుణమాఫీ ప్రకటించిందన్నారు. కేసీఆర్ టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చి తెలంగాణను మరిచి పోయారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. దళిత, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల ప్రజలంతా ఓట్లు చీలిపోనివ్వకుండా గంపగుత్తగా కాంగ్రెస్‌కు వేయాలని కోరారు. సీనియర్ నాయకుడు, పాలన అనుభవదక్షుడు సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సాలూర శివారులో ఉన్న మంజీర నది అవతలి ఒడ్డున గల బిలోలి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ వారేనని, ఇక్కడ కూడా సుదర్శన్‌రెడ్డి ఉండబోతున్నారన్నారు. సాలూరతో తమకు బంధం ఉందన్నారు. మంజీరపై వంతెన ప్రారంభోత్సవానికి తన తండ్రి, అప్పటి సీఎం స్వర్గీయ శంకర్‌రావు చౌహాన్, ఉమ్మడి రాష్ట్ర సీఎం ఎన్టీఆర్ కలిసి వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మంజీరపై చెక్‌డ్యాం నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని, దానికి సహకరించాలని అశోక్‌రావు చౌహాన్‌ను కోరారు. కేసీఆర్ ప్రభుత్వం నిజాంషుగర్స్‌ను మూసివేసి చెరుకు రైతులను అవస్థల పాలు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెరుకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం మాజీ ఎమ్మెల్యే అంజలి మాట్లాడుతూ కేసీఆర్ లాంటి అవినీతి సీఎం దేశంలో ఎక్కడా లేరన్నారు. టీపీసీసీ డెలిగెట్ గంగాశంకర్, మాజీ జెడ్పీటీసీ అల్లె లావణ్య, మండలాధ్యక్షుడు మందర్న రవి, హన్మంత్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బోధన్: కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి సమక్షంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. సాలూర సర్పంచ్ భుయ్యాన్ చంద్రకళ రాజప్పపటేల్, వీరశైవలింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివపూజ శంకర్, సొసైటీ డైరెక్టర్లు గంటి హోట్లప్ప, సంగెపు భూమయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కెజీ గంగారాం, బండె గంగాధర్ పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అల్లె లావణ్య రమేష్ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నియెజకవర్గంలో బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే నీతీమంతమైన పాలన అందిస్తామని బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 1, 2వ వార్డుల్లో ఆయన శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో రాకేశ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనే సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఆ పథకాలు బీఆర్‌ఎస్ ఇస్తుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆర్మూర్ నియెజకవర్గం గంజాయి, రౌడియిజానికి కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. నాయకులు కంచెట్టి గంగాధర్, జీవీ నర్సింహారెడ్డి, ద్యాగ ఉదయ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ సర్పంచులు

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలం గంగసరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు నర్సారెడ్డి, సాయన్న, చిన్నయ్య శుక్రవారం బీజేపీలో చేరారు. వీరితో పాటు 40 మంది గ్రామస్తులను పైడి రాకేశ్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కల్లె సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

గిరిజనులకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అన్యాయం చేశాయి

బాల్కొండ బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ



మాట్లాడుతున్న ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బంజార, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేశాయని బీజేపీ ఎమ్మెల్యే అబ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని రూప్ల తండా, పెద్దమ్మకాడి తండా, గోన్‌గొప్పుల గ్రామాల్లో ఆమె శుక్రవారం ప్రచారం చేశారు. పోడు భూములకు పట్టాలు బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చారని ఆరోపించారు. నియోజకవర్గంలో చేసే ప్రతి పనిలో మంత్రి ప్రశాంత్ రెడ్డి 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో పనులన్నీ నాసిరకంగా ఉన్నాయన్నారు. కమలం పువ్వుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండలాధ్యక్షుడు ములిగే మహిపాల్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో భారతి

వర్ని(మోస్రా): మోస్రా మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పిట్లా ఉమా శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సర్పంచులు, అధికారులు గైర్హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరు కాకపోవడంతో తూతు మంత్రంగా సభను నిర్వహించి ముగించారు. వచ్చిన కొద్దిపాటి అధికారులు ఆయా శాఖల పనితీరును సభ దృష్టికి తీసుకువచ్చి సమావేశాన్ని మమ అనిపించారు. ఎంపీడీవో భారతి, ఎంఈవో శాంతకుమారి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మిర్దాపల్లి, దేగాం, ఆలూర్, కల్లెడి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల పరిశీలన అధికారి సుబ్రా చక్రవర్తి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. నాలుగు రోజు ల్లో పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను త్వరగా కల్పించాలన్నారు. తహసీల్దార్ నరేష్, ఆర్ఐ రఫీక్, జూనియర్ అసిస్టెంట్ స్వాతి పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.05
స్పార్క్ లైఫ్ (తెలుగు)-1.30, 10.30
మా ఊరి పొలిమేర-2(తెలుగు) - 5.00
కీడా కోలా(తెలుగు) - 7.50

స్క్రీన్-2 – మంగళవారం (తెలుగు)- 10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – అన్వేషి (తెలుగు)- 10.00
సప్త సాగరాలు(తెలుగు)- 12.50, 4.00, 7.10
టైగర్-3 (తెలుగు)- 10.20

స్క్రీన్-4 – టైగర్-3 (తెలుగు)- 11.15, 2.40, 6.05, 9.30

ఘనంగా నాగుల చవితి



నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

ఎడపల్లి/వర్ని: నాగుల చవితిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎడపల్లి మండలం జానకంపేట, ఠాణాకలాన్ గ్రామాల మధ్య ఉన్న అడవిలో నెలకొన్న నాగదేవతకు భక్తులు పూజలు చేశారు. వర్నిలోని అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గల్ఫ్ కార్మికులు

వేల్పూర్: గల్ఫ్ దేశాల్లో మరణించిన వారికి రూ.5 లక్షల బీమాను ప్రకటించడంతో మండలంలోని పచ్చలనడ్కుడ, వాడి గ్రామాలలో శుక్రవారం సాయంత్రం సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయకుడు, సర్పంచులు ఏనుగు గంగారెడ్డి, గోపు మహేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



బోధన్‌టౌన్: బీఆర్‌ఎస్ పార్టీకి ఉద్యమకారులు గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివరాజ్ రాజీనామా చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ గెలుపు కోసం రెండు పర్యాయాలు కృషి చేశామని చెప్పారు. ఆయన నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మెల్యే ఇసుక మాఫియాతో పాటు రైతుల వద్ద నుంచి కడ్తా పేరిట వడ్ల దోపిడీకి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన చేపడుతున్న పార్టీలో ఉండడం ఇష్టం లేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఎమ్మెల్యేను ఓడించేందుకు కృషి చేస్తానని మాజీ కౌన్సిలర్ అన్నారు. తటస్తంగా ఉంటు ఎమ్మెల్యే ఓటమికి కృషి చేస్తానని గోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో నరేందర్‌రెడ్డి, ఊశం సాయిలు, తుడుం రాములు, శ్యామ్ ఉన్నారు.